# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 12, జూన్ 2026


### ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల తొలగింపుకు

# కుట్ర జరుగుతోంది

✻ పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ



**బెల్లంపల్లి, జూన్ 11, ప్రభాతవార్త**

బెల్లంపల్లి మండలం కన్నాల ఆర్పీ గార్డెన్స్‌లో నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అవగాహన కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, రాష్ట్ర రైతు సమితి చైర్మన్ అవినాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా భూత్ స్థాయి సమావేశాలు నిర్వహించి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీ పార్టీ ఎస్ఐఆర్ పేరుతో ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు. గెలిచే అవకాశాలు ఉన్న అభ్యర్థులను ఓడించేందుకు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్న ఓటర్లను జాబితాల నుంచి తొలగించే కుట్ర జరుగుతోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌లో "ఓటు చోరీ" అంశంపై అనేకసార్లు నిరసనలు తెలిపిందని గుర్తుచేశారు. రాజ్యసభ ఎన్నికల్లో మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను రద్దు చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. అదే సమయంలో బీజేపీ నాయకుడు పట్నాకర్ నామినేషన్‌లో లోపాలు ఉన్నప్పటికీ అదనపు గడువు ఇవ్వడం ద్వంద్వ వైఖరికి ఉదాహరణ అని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవసరం ఉందని, ఎన్నికల ముందు ఓటర్ల జాబితాల్లో మార్పులు చేసి రాజకీయ లాభం పొందే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే బీజేపీ పార్టీ ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేదని విమర్శించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైందని అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి రక్షణ కవచమని, ప్రతి పౌరుడు రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవించి పరిరక్షించాలని ఎంపీ గడ్డం వంశీకృష్ణ కోరారు.



# ఘోర రోడ్డు ప్రమాదం

## ఆగి ఉన్న లారీని ఢీకొని మంటల్లో చిక్కుకుని డ్రైవర్ సజీవ దహనం

**నిర్మల్, జూన్ 11, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా, నిర్మల్ రూరల్ మండలం మేడిపల్లి గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని మరో లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో భారీగా మంటలు చెలరేగి ఒక డ్రైవర్ క్యాబిన్‌లోనే సజీవ దహనమయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. గురువారం తెల్లవారుజామున 3:10 గంటల సమయంలో టీజీ01టీ1773 నంబర్ గల లారీ సిరికొండ నుండి జొన్నల లోడుతో సిద్దిపేటకు వెళ్తోంది. మేడిపల్లి శివారుకు చేరుకోగానే, నాగ్‌పూర్ వైపు నుంచి ఆలుగడ్డల లోడుతో హైదరాబాద్ వెళ్తున్న ఏపీ07 టిహెచ్7156 నంబర్ గల లారీ టైర్ పంక్చర్ కావడంతో హైవే పక్కన నిలిపి ఉంది. వేగంగా వచ్చిన జొన్నల లారీ రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు జొన్నల లోడుతో వెళ్తున్న లారీ ముందు భాగం నుజ్జునుజ్జై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. లారీ డ్రైవర్ క్యాబిన్‌లో మిగతా 2లో..

# జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంను విజయవంతం చేయాలి

✪ కలెక్టర్ హరిత



**ఆసిఫాబాద్, జూన్ 11, ప్రభాతవార్త :**

జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హరిత సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ భవన సముదాయ సమావేశ మందిరంలో జాతీయ పల్స్ పోలియో, జాతీయ నూలిపురుగుల నివారణ దినోత్సవాల ముందస్తు ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ పల్స్ పోలియో దినోత్సవము సందర్భంగా ఈ నెల 28న 0 నుండి 5 సంవత్సరాల లోపు వయస్సు గల మిగతా 2లో..

# గాలివాన బీభత్సం





**చింతలమానేపల్లి, జూన్ 11, ప్రభాతవార్త:**

మండల పరిధిలో బుధవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పంజ విసిరింది. గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని గూడెం, బూరుగూడ గ్రామాల్లో గాలివాన తీవ్ర బీభత్సం సృష్టించింది. ఒక్కసారిగా విరుచుకుపడిన ప్రకృతి ప్రకంపనలకు రేకుల షెడ్లలో నివసించే ప్రజలు ప్రాణ భయంతో సురక్షిత ప్రాంతాలకు వెళ్ళారు.గాలి తీవ్రతకు రెండు గ్రామాల్లో సుమారు యాభై ఇళ్ల పైకప్పులు,రేకులు గాల్లోకి లేచిపోయాయి. ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో నిత్యావసర సరుకులు, గృహోపకరణాలు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి.భారీ ఈదురుగాలుల ధాటికి గ్రామాల్లో పెద్దపెద్ద చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది.గ్రామాలు చీకటిమయం కావడంతో రాత్రంతా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గాలివాన కారణంగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపరిహారం అందించి తమ్ము ఆదుకోవాలని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# ఆశా వర్కర్లకు వెంటనే మే నెల వేతనాలు చెల్లించాలి

**జూన్ 14 వరకు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాల అందజేత: సీఐటీయూ**

**మంచిర్యాల, జూన్ 11 ప్రభాతవార్త**

ఆశా వర్కర్లకు మే నెల వేతనాలను వెంటనే చెల్లించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మంచిర్యాల పట్టణంలోని చార్వక హాల్‌లో కామ్రేడ్ సమ్మక్క అధ్యక్షతన నిర్వహించిన ఆశా వర్కర్స్ యూనియన్ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని ఆయన విమర్శించారు. గత నెలకు సంబంధించిన వేతనాలు కూడా ఇప్పటి వరకు చెల్లించకపోవడంతో ఆశా వర్కర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సమ్మక్క, జిల్లా కార్యదర్శి సరోజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల పట్ల అవలంబిస్తున్న విధానాలను నిరసిస్తూ, స్థిర వేతనాల సాధన కోసం జూన్ 14వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆశా యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శోభ, నాయకులు లీలారాణి, విజయలక్ష్మి, లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు శైలజ, హెలన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు



## బెల్లంపల్లిలో ఫారెస్ట్ కార్యాలయంలో రాపిడ్ రెస్క్యూ టీం భవన ప్రారంభం

**బెల్లంపల్లి, జూన్ 11, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలోని ఫారెస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాపిడ్ రెస్క్యూ టీం (ఆర్ఆర్‌టి) నూతన భవనాన్ని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అడవి జంతువులు మానవ నివాస ప్రాంతాల్లోకి వచ్చినప్పుడు ప్రజల భద్రతతో పాటు జంతువుల రక్షణ కూడా అత్యంత కీలకమని తెలిపారు. మనిషిజంతు ఘర్షణలను తగ్గించడంలో రాపిడ్ రెస్క్యూ టీమ్‌లు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అటవీ సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఈ తరహా సదుపాయాలను మరింత బలోపేతం చేయడం ద్వారా భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. అలాగే స్థానిక ప్రజలు అడవి జంతువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ఘటనలు జరిగినా వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డిఓ విజయ్ కుమార్, ఎఫ్ఆర్ఓ పూర్ణచందర్, డిప్యూటీఆర్ఓ గౌరీ శంకర్, ఎఫ్ఎస్ఓ ఫారెస్ట్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలు మంజూరు చేయాలి

**తాండూర్, జూన్ 11, ప్రభాతవార్త :**

తాండూర్ మండలానికి పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలు మంజూరు చేయాలని మాజీ ఎంపీపీ మాసాడి శ్రీదేవి, టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు బోడ సతీష్ కోరారు. తాండూర్ పర్యటనకు గురువారం వచ్చిన మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రయ్యను వారు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాండూర్ మండలంలో చాలా మంది ఆర్థికంగా వెనుకబడిన పిల్లలు ఉన్నప్పటికీ పూర్వ ప్రాథమిక విద్య కేంద్రం ఒకటి కూడా మంజూరు రాలేదన్నారు. పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలు మంజూరు అయితే మండలంలోని పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు. పూర్వ ప్రాథమిక విద్య కేంద్రం మంజూరు అయ్యేవిధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎలుక రాంచందర్, చంద్రశేఖర్, శ్రీరాములు పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం

**(మొదటిపేజీ తరువాయి)**

ఇరుక్కుపోయి బయటకు రాలేకపోయాడు. మంటలు వేగంగా వ్యాపించడంతో అక్కడికక్కడే సజీవ దహనమయ్యాడు. మృతుడిని ఆదిలాబాద్ జిల్లా సోనాల మండలం, గుట్ట పక్క తండాకు చెందిన పవర్ జోహార్ సింగ్ అలియాస్ జవారి సింగ్ (41)గా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల సంఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పార్కింగ్‌కు అనుమతి లేని ప్రమాదకర ప్రదేశంలో ఏపీ07 టిహెచ్7156 లారీని నిలిపి ఉంచడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆగి ఉన్న లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంతో 44వ జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. క్రేన్ల సహాయంతో లారీలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. హైవేపై వాహనాలు నిలిపే సమయంలో రిఫ్లెక్టర్లు, ఇండికేటర్లు ఏర్పాటు చేసి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లేదంటే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## 2వ విడత దళిత బంధు వెంటనే అమలు చేయాలి

**మాదిగ హక్కుల దండోరా డిమాండ్**

**బెల్లంపల్లి, జూన్ 11, ప్రభాతవార్త**



2వ విడత దళిత బంధు పథకాన్ని వెంటనే విడుదల చేయాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి లకు వినతిపత్రాన్ని అందజేశారు మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన దళిత బంధు పథకాన్ని పూర్తిస్థాయిలో అర్హులకు అందించకుండా, రాజకీయ ప్రయోజనాల కోసం పరిమితం చేసి, అసలైన లబ్ధిదారులను విస్మరించిందని ఆరోపించారు. అప్పటి పిసిసి అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పాదయాత్రలో దళిత బంధును మరింత విస్తరించి, రూ.10 లక్షలను రూ.12 లక్షలకు పెంచి ప్రతి అర్హ దళిత కుటుంబానికి అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీలపై నమ్మకం ఉంచి దళిత సమాజం కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి అధికారంలోకి తీసుకువచ్చిందని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ల గడుస్తున్నప్పటికీ, 2వ విడత దళిత బంధు అమలు కాకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ పథకాన్ని అమలు చేసి అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి లబ్ధి చేకూర్చాలని డిమాండ్ చేశారు. అలాగే గత కొన్ని సంవత్సరాలుగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలను కూడా ప్రభుత్వం విడుదల చేయడం లేదని విమర్శించారు. వెంటనే ఎస్సీ కార్పొరేషన్ లోన్స్‌ను విడుదల చేయాలని కోరారు. అదనంగా మాదిగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రాష్ట్రంలో ఉన్న వారి జనాభా శాతానికి అనుగుణంగా న్యాయమైన వాటాను కల్పించాలని డిమాండ్ చేశారు.

## వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

**- కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సల నిర్వహణపై మేయర్ సమీక్ష**

**మంచిర్యాల, జూన్ 11 ప్రభాతవార్త**



మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆండాలమ్మ కాలనీ చెత్త నిల్వ కేంద్రం వద్ద మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీధి కుక్కల సంరక్షణ, కుటుంబ నియంత్రణ కేంద్రాన్ని మేయర్ దర్శి మధుకర్, ఉప మేయర్ సక్క రమ్య మహేష్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్ కలిసి సందర్శించి కేంద్రం పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హైటెక్ సిటీ ప్రాంతం నుంచి తీసుకువచ్చిన వీధి కుక్కలకు నిర్వహిస్తున్న కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలను మేయర్ పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడి చికిత్సల విధానం, చేపడుతున్న చర్యల గురించి వివరాలు తెలుసుకున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వీధి కుక్కలకు ఈ కేంద్రంలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించడం ద్వారా వాటి జనాభాను నియంత్రించవచ్చని అధికారులు మేయర్‌కు వివరించారు. ప్రజల భద్రతతో పాటు వీధి కుక్కల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప మున్సిపల్ కమిషనర్ రాజకుమార్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంను విజయవంతం చేయాలి

**(మొదటిపేజీ తరువాయి)**

పిల్లలందరికీ తప్పనిసరిగా పల్స్ పోలియో వ్యాక్సిన్ (పోలియో చుక్కలు) అందించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 5 సంవత్సరాల లోపు పిల్లలు 46516 మంది ఉన్నారని, వారి కోసం జిల్లా వ్యాప్తంగా 670 పల్స్ పోలియో వ్యాక్సినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా రద్దీగా ఉండే ప్రాంతాలలో ఉండే పిల్లల కోసం బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో సుమారు 18 మొబైల్ వ్యాక్సినేషన్ కేంద్రాలను (సంచార బూత్‌లు) ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జూన్ 28వ తేదీన పోలియో బూత్‌లలో చుక్కలు వేయించుకోలేకపోయిన పిల్లల కోసం జూన్ 29, 30 తేదీలలో వైద్య ఆరోగ్య సిబ్బంది నేరుగా ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలను వేస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు. అదేవిధంగా జూలై 13న నిర్వహించబోయే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని 1 సంవత్సరం నుండి 19 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలు, యువత అందరికీ నులిపురుగుల నివారణ (అల్బెండజోల్) మాత్రలను అందించాలని పేర్కొన్నారు. దీని కోసం జిల్లాలో 167702 మందిని గుర్తించినట్లు తెలిపారు. వీరందరికీ అన్ని ప్రభుత్వ/ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఈ నివారణ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. వైద్య ఆరోగ్య, విద్యా, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులందరూ పరస్పర సమన్వయంతో పనిచేసి ఈ రెండు బృహత్తర కార్యక్రమాలను జిల్లాలో వంద శాతం విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల మహిళల సహకారం తీసుకోవాలని, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో దప్పు చాటింపు, మైక్ అనౌన్స్‌మెంట్ల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సీతారాం, వివిధ సంబంధిత ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బోరింగ్ పనులకు భూమి పూజ

**తాండూర్, జూన్ 11, ప్రభాతవార్త**

మండలంలోని మాదారం3 ఇంక్లైన్ లో బోరింగ్ పనులకు సర్పంచ్ చందనాల రవికుమార్, కాంగ్రెస్ నేత ఎండి ఈసా భూమి పూజ చేసి, కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యే గడ్డం వినోద్ సహకారంతో బోరింగ్ కోసం నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతపురి మల్లేశ్వరి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెట్టెం విష్ణు కళ్యాణ్, నాయకులు కుర్సింగ తిరుపతి, రెబ్బెన శ్రీనివాస్, చింతపురి లచ్చన్న, దుర్గం చంద్రయ్య, కోయ మహేష్, పాషా, తదితరులు పాల్గొన్నారు.



## అమృత్ 2.0 పనులు వేగవంతం చేయాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య**

**బెల్లంపల్లి, జూన్ 11, ప్రభాతవార్త**

ఇంటింటికి నిరంతర త్రాగునీటి సరఫరా లక్ష్యంగా చేపట్టిన అమృత్ 2.0 పనులను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అధికారులను ఆదేశించారు. గురువారం బెల్లంపల్లి పట్టణంలో అమృత్ 2.0 పథకం కింద జరుగుతున్న పనులను బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ త్రాగునీటి సరఫరా పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన తాగునీటి సదుపాయం కల్పించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. పనులలో ఎలాంటి ఆలస్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్య శాఖ ఈఈ, డీఈఈ లతో సమావేశమై పనుల పురోగతి, ఎదుర వుతున్న సమస్యలు, వాటి పరిష్కారాలపై వివరాలు తెలుసుకున్నారు. పనుల అమలులో విభాగాల మధ్య సమన్వయం పెంచి, అవసరమైన సిబ్బంది, యంత్రాంగాన్ని సమకూర్చి పనులను వేగవంతం చేయాలని సూచించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికా బద్ధంగా అమలు చేయాలని, అమృత్ 2.0 పనుల వల్ల ప్రజలకు ఇబ్బందు లు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్య క్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్, ప్రజారోగ్య శాఖ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆహార భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, జూన్ 11, ప్రభాతవార్త**

ఆహార భద్రత విషయంలో ప్రతి ఒక్కరు నాణ్యత ప్రమాణాలు పాటించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఆహార భద్రత శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆహార భద్రత శాఖ అధికారి వాసురాం, ఇతర అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆహార భద్రత ప్రమాణాలను అందరూ పాటించాలని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతను ఆహార భద్రతా శాఖ అధికారులు పరీక్షించాలని తెలిపారు. ఆహార సంబంధిత వివిధ వ్యాపార సంస్థలలో కాల పరిమితి ముగిసిన ఆహార పదార్థాలు లభించినట్లయితే పూర్తి వివరాలతో నివేదిక అందించాలని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అంగన్వాడీ టీచర్లు తమ కేంద్రంలో పిల్లలకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని, పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. అనంతరం అంగన్వాడీ టీచర్లకు ఎఫ్ ఎస్ ఎస్ ఎ ఐ నమోదు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు జీడీఆర్ మెమోరియల్ ట్రస్ట్ పురస్కారం అందజేత

**భైంసా, జూన్ 11, ప్రభాతవార్త:**




ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తూ, గత మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జీడీఆర్ మెమోరియల్ ట్రస్ట్ నగదు పురస్కారాలను అందజేసి ఘనంగా సన్మానించింది. గురువారం భైంసాలోని జీడీఆర్ కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో గల ట్రస్ట్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా పార్డి(కె) గ్రామానికి చెందిన ఎస్. కిరణ్య, మెదన్‌పూర్ గ్రామానికి చెందిన కే. వైష్ణవిలను ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అనిల్ కుమార్ జాదవ్ శాలువాతో సత్కరించి, నగదు పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన సభలో డాక్టర్ అనిల్ కుమార్ జాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోవడానికి నిరంతరం కష్టపడి చదవాలన్నారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ఉన్నత విద్యలో రాణించి, తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఇలాంటి ప్రతిభావంతులైన పేద విద్యార్థులను జీడీఆర్ ట్రస్ట్ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సన్మాన కార్యక్రమం విద్యార్థుల్లో మరింత స్ఫూర్తిని నింపిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై. సుప్రియ, ట్రస్టు విద్యావిభాగం కార్యదర్శి జాధవ్ పుండలిక్ రావు పాటిల్, పీఆర్వో కంతాళే రఘువీర్ పాటిల్, పీఏ అక్షయ్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# మోదీ పాలనలో దేశాభివృద్ధి పేదల సంక్షేమమే లక్ష్యం

**● రఘునాథ్ వెరబెల్లి**

**మంచిర్యాల, జూన్ 11 ప్రభాతవార్త**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశాభివృద్ధి, పేద ప్రజల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. మోదీ పాలనకు పన్నెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంచిర్యాల పట్టణంలోని సురభి హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. దేశ ప్రజలు మోదీ ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసం కారణంగానే వరుసగా మూడోసారి కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడిందని వారు పేర్కొన్నారు. ప్రజల నమ్మకానికి అనుగుణంగా దేశాభివృద్ధి, పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. గత పన్నెండు సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలను వెచ్చించిందని చెప్పారు. జాతీయ రహదారుల నిర్మాణం, రైల్వే వ్యవస్థ అభివృద్ధి, నూతన విమానాశ్రయాల ఏర్పాటు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు కేంద్ర నిధులతోనే చేపట్టినట్లు వివరించారు. మంచిర్యాల జిల్లాలో కూడా జాతీయ రహదారుల అభివృద్ధి, అమృత్ భారత్ పథకం కింద రైల్వే స్టేషన్ ఆధునీకరణతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలయ్యాయని తెలిపారు. ఇదే అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గాజుల ముకేష్ గౌడ్, దుర్గం అశోక్, ఎనగందుల కృష్ణమూర్తి, వంగపల్లి వెంకటేశ్వరరావు, తుల ఆంజనేయులు, పెద్దపల్లి పురుషోత్తం, కస్తూరి నాగరాజు, బోట్ల అనిత, సంజీవరావు, పట్టి వెంకటకృష్ణ, వైద్య శ్రీధర్, అమిరిశెట్టి రాజ్‌కుమార్, కుర్రే చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భాజపా నాయకులు

# విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎంపీ చొరవ

**జిల్లా కేంద్ర లైబ్రరీలో సౌకర్యాల పరిశీలన ఉద్యోగ లక్ష్యాల సాధనకు యువత కృషి చేయాలని సూచన**

**మంచిర్యాల, జూన్ 11 ప్రభాతవార్త**

విద్యార్థుల సమస్యల పరిష్కారం, వారి విద్యాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ తెలిపారు. గత పర్యటనలో మంచిర్యాల జిల్లా కేంద్ర లైబ్రరీని సందర్శించిన సందర్భంగా అక్కడ చదువుతున్న విద్యార్థులు తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన ఎంపీ, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. దీంతో విద్యార్థులకు అవసరమైన వాష్‌రూమ్‌లు, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయగా, వాటి పనితీరును ఎంపీ గురువారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి అందుబాటులో ఉన్న సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ, త్వరలో రానున్న ఉద్యోగ నోటిఫికేషన్లను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు కష్టపడి చదివి తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. మంచిర్యాల జిల్లా యువత అధిక సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్య పెంపు అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, లైబ్రరీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంపీ లైబ్రరీలో పాల్గొని అందరితో మాట మంతి చేస్తున్న దృశ్యం

# రాంప్రసాద్ బిస్మిల్ జయంతి సందర్భంగా ఘన నివాళులు

**దేశభక్తుల త్యాగాలను యువతకు తెలియజేయాలి: మాజీ ఆర్మీ దంపతులు**

**మందమర్రి, జూన్ 11, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణానికి చెందిన మాజీ ఆర్మీ జవాన్, ప్రస్తుతం ఎస్ అండ్ పిసి ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న రాజేష్ పివ్వాల్, ఆయన సతీమణి రాణి పివ్వాల్ దంపతులు గురువారం తమ నివాసంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు రాంప్రసాద్ బిస్మిల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ బిస్మిల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలను అర్పించిన మహనీయుల త్యాగాలు నేటి యువతకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. వారి సేవలను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాంప్రసాద్ బిస్మిల్ 1887 జూన్ 11న బ్రిటిష్ భారతదేశంలోని ఉత్తరప్రదేశ్ రాష్ట్రం షాజహాన్‌పూర్‌లో జన్మించినట్లు వివరించారు. హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యుల్లో ఆయన ఒకరని, స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ప్రముఖ విప్లవకారుడు భగత్ సింగ్ కూడా బిస్మిల్‌ను ఉర్దూ, హిందీ భాషల్లో గొప్ప కవిగా ప్రశంసించారని గుర్తు చేశారు. 1925లో జరిగిన చారిత్రాత్మక కాకోరి కుట్ర కేసులో పాల్గొని బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన మహా విప్లవకారుడిగా బిస్మిల్ చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. స్వామి దయానంద సరస్వతి రచించిన సత్యార్థ ప్రకాశ్ గ్రంథం ప్రభావంతో ఆయన ఆర్య సమాజ్ సిద్ధాంతాలను అనుసరించారని వివరించారు. దేశ స్వాతంత్రం కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన గొప్ప దేశభక్తుడు రాంప్రసాద్ బిస్మిల్ 1927 డిసెంబర్ 19న అమరుడయ్యారని, ఆయన దేశభక్తి, త్యాగనిరతి నేటి యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. దేశం కోసం జీవించిన మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.



# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య**

**తాండూర్, జూన్ 11, ప్రభాతవార్త :**

ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రయ్య అన్నారు. తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బూత్ స్థాయి అధికారులు, బూత్ ఏజెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భముగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు చేయాలన్నారు. ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులు, ఓటర్ల పేర్లు తొలగింపు ప్రక్రియలో పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి అధికారులు, భూస్థాయి ఏజెంట్లు ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన పొందించుకొని ఏలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎస్.ఐ.ఆర్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో శ్రీనివాస్, నాయబ్ తహసిల్దార్ కల్పన, గిర్దావర్ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య



మంత్రి గడ్డం వివేక్ చేతుల మీదుగా దళిత రత్న అవార్డు అందుకుంటున్న వెంకటేష్

## దళిత రత్న అవార్డు అందుకున్న వెంకటేష్

**తాండూర్, జూన్ 11, ప్రభాతవార్త :**

మండలంలోని కాసిపేట గ్రామానికి చెందిన దళిత ఆదివాసీ బహుజన చైతన్య వేదిక రాష్ట్ర కార్యదర్శి గొర్లపల్లి వెంకటేష్ దళిత రత్న అవార్డుకు ఎంపికయ్యారు. దళిత గిరిజనులకు చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం డాక్టర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా దళిత రత్న అవార్డు ప్రకటించింది. గురువారం చెన్నూరు క్యాంపు కార్యాలయంలో వెంకటేష్ కు కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి దళిత రత్న అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత ఆదివాసీ బహుజన చైతన్య వేదిక రాష్ట్ర ప్రచార కార్యదర్శి పర్స శ్రీనివాస్, గోమాస రాజలింగు, తదితరులు పాల్గొన్నారు.

## డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థులకు పరీక్షల షెడ్యూల్ విడుదల

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 11, ప్రభాతవార్త :**

డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాగజ్‌నగర్‌లో డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపల్ కె. శ్రీదేవి, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ తూదూరు దత్తాత్రేయ తెలిపారు. సెమిస్టర్6 పరీక్షలు జూన్ 14, 2026 నుండి, సెమిస్టర్4 పరీక్షలు జూన్ 22, 2026 నుండి, అలాగే సెమిస్టర్2 పరీక్షలు జూలై 1, 2026 నుండి ప్రారంభం కానున్నట్లు తెలిపారు. అలాగే సెమిస్టర్4, సెమిస్టర్2 పరీక్షలకు సంబంధించిన పరీక్షా రుసుమును రూ.500 అపరాధ రుసుముతో కలిపి జూన్ 16, 2026 వరకు చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యే సమయంలో హాల్ టికెట్‌తో పాటు ఆధార్ కార్డు ఒరిజినల్ లేదా ఇతర చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లు, పుస్తకాలు లేదా ఇతర ఎలాంటి మెటీరియల్‌ను తీసుకురావద్దని హెచ్చరించారు. అర్హులైన విద్యార్థులు నిర్ణీత గడువులోగా పరీక్షా రుసుము చెల్లించి, పరీక్షలకు సంబంధించిన అన్ని సూచనలను పాటించాలని వారు కోరారు.



## రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

**తాండూర్, జూన్ 11, ప్రభాతవార్త :**



మండలంలోని నయారా పెట్రోల్ బంక్ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముస్కి రాజశేఖర్ (19) అనే ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందినట్లు తాండూర్ ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ప్రకారం.. తాండూర్ గ్రామపంచాయతీలోని వాల్మీకి నగర్ కు చెందిన ముస్కి రాజశేఖర్, బుల్లి తిరుపతి అనే ఇద్దరు ట్రాక్టర్ డ్రైవర్లు మంచిర్యాల మండలం ముల్కాల ఆన్లైన్ ఇసుక కొరకు డ్రైవింగ్ చేస్తూ వెళ్తున్నారు. రాజశేఖర్, తిరుపతి నడిపిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆసిఫాబాద్ నుంచి మంచిర్యాల వైపు వస్తున్న లారీ అతివేగంగా వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాజశేఖర్ కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే రాజశేఖర్ మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య

## పీఎం పోషణ్ పథకాన్ని పగడ్బందీగా అమలు చేయాలి

**- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య**

**తాండూర్, జూన్ 11, ప్రభాతవార్త :**

ప్రధానమంత్రి పోషణ్ (మధ్యాహ్నం భోజనం) పథకాన్ని పగడ్బందీగా అమలు చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య అన్నారు. తాండూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో గురువారం ప్రధానమంత్రి పోషణ్ పథకం అమలు, నిర్వహణపై ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రతిరోజు రుచికరమైన, నాణ్యమైన, పరిశుభ్రమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. ఎంఈఓ దుర్గం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ సంఖ్యను పెంచాలని, పాఠశాల అభివృద్ధిలో సర్పంచులను, ప్రజా ప్రతినిధులను భాగస్వాములు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఉమాదేవి, ప్రదీప్, భాగ్య, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుడిని పరామర్శించిన రాంకిషన్‌రెడ్డి

**సారంగాపూర్, జూన్ 11, ప్రభాతవార్త:**



మండలంలోని యాకర్ పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కండెల శ్రీధర్ నానమ్మ కండెల కళావతి కొద్దిరోజుల క్రితం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అల్లాడి రాంకిషన్ రెడ్డి గురువారం యాకర్ పల్లిలోని శ్రీధర్ నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కళావతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. శ్రీధర్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. ఈ పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దేవి శంకర్, నాయకులు జీవన్ రావు, శ్యాం రెడ్డి, యాకర్ పల్లి మాజీ సర్పంచ్ రమణ, మాజీ ఉప సర్పంచ్ సాయందర్, పత్తి సాయన్న, ఆరుగుల చిన్నయ్య, పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

**ఆసిఫాబాద్ టౌన్, జూన్ 11, ప్రభాతవార్త :**

జిల్లా కేంద్రంలోని ఏడవ వార్డులో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సత్వర చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్ లు అన్నారు. గురువారం ఏడవ వార్డులో ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ కాలనీలో ఉన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించి ఏలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, ఆరవ వార్డు కౌన్సిలర్ చిలువేరు వెంకన్న, బారాస నాయకులు అరవింద్, సాయి తదితరులు ఉన్నారు.

## టాయిలెట్ పనులను ప్రారంభించిన అదనపు కలెక్టర్

**తాండూర్, జూన్ 11, ప్రభాతవార్త :**

తాండూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో గురువారం టాయిలెట్ నిర్మాణ పనులకు మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఎంఈఓ దుర్గం శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల సౌకర్యం టాయిలెట్ నిర్మాణ కోసం ఎన్ఆర్ ఈజీఎస్ నిధులు విడుదల అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ అనిల్ కుమార్, సర్పంచ్ సురేష్, ఉప సర్పంచ్ సత్యనారాయణ, వార్డ్ మెంబర్లు జుబేర్, విష్ణు కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.



## 4399 రోజుల ప్రధాని పాలనపై పార్టీ శ్రేణుల హర్షం

**ఆసిఫాబాద్, జూన్ 11, ప్రభాతవార్త :**

భారతదేశ రాజకీయ చరిత్రలో 4399 రోజుల పాటు అత్యధిక కాలం ప్రధానమంత్రిగా కొనసాగి, సరికొత్త రికార్డు సృష్టించిన ప్రధాని నరేంద్ర మోదిని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు అరిగేలా మల్లికార్జున్, కోవ విజయ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 నుండి నేటి వరకు అవినీతి రహిత, పారదర్శకమైన పాలనతో దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత నరేంద్ర మోదీకు దక్కుతుందన్నారు. దేశ రక్షణ, పేదల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి లక్ష్యాలుగా సాగుతున్న మోదీ ప్రస్థానంలో ఎన్నో అసాధ్యమైన రికార్డులు, విజయాలు సాధ్యమయ్యాయని వారు కొనియాడారు. దశాబ్దాల కాశ్మీర్ సమస్యకు ముగింపు పలుకుతూ ఆర్టికల్ 370ని రద్దు చేసి దేశ సమగ్రతను చాటారని, కోట్ల మంది భారతీయుల శతాబ్దాల కల అయిన రామమందిర నిర్మాణాన్ని పూర్తి చేసి దేశ సంస్కృతికి పునర్వైభవం తెచ్చారని, భారతదేశాన్ని ప్రపంచంలోనే 5వ అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగేలా చేశారని, రాబోయే రోజుల్లో 3వ స్థానానికి చేర్చడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారని, వీటితో ఓటు మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు.